# మిలీనియమ్ పురస్కారమ్!




-కర్లపాలెం హనుమంతరావు



టి.వీలో వార్తలొస్తున్నాయి.

''నిరాటంకంగా విద్యుత్ సరఫరాకు ప్రభుత్వ ప్రత్యేక పథకం ...'' తప్పుమని పోయింది కరెంటు.

ఉక్కపోతకు ఇంట్లో ఉండలేక రోడ్డు మీద కొచ్చి పడ్డాను.

ఆదివారం. సాయంత్రం. సినిమా జనంతో సెంటరు కిటకిటలాడుతోంది.

హాళ్ళ బైట అప్పుడే 'హవుస్ ఫుల్' బోర్డులు పెట్టేశారు.

ఉడుపి హోటల్లో కాఫీ తాగి పార్కు వైపుకు బైలుదేరాను.

ఈ ఊరు నాకు కొద్దిగా క్రొత్తే. మా బావ మరిదికీమధ్యే ఇక్కడికి ట్రాన్స్‌ఫరయింది. అతనితో పని వుండి వస్తే సమయానికి వూళ్ళో లేడు. ఎలాగైనా కలిసి పోవాల్సిన పని. మర్నాడొస్తాడంటే వుండిపోయాను. పార్కు ఎదురుగా టౌన్ హాలుంది. డెకరేషన్ లైట్లు ఝగేల్ ఝగేల్‌మని వెలిగిపోతున్నాయి. మైకులో నుండి పాటల గోల గండు పిల్లులు కొట్లాడుకుంటున్నట్లుంది.

హాలు బైటున్న బోర్డు మీద పెద్ద అక్షరాలతో రాసి వుంది.

''మిలీనియమ్ పురస్కారాల మహోత్సవం ... అందరికీ ఇదే మా ఆహ్వానం'' అవార్డు గ్రహీతల లిస్టు జనాభా లెక్కల తాతలాగుంది.

''వెళదామా ... వద్దా'' అని తటపటాయిస్తున్నాను.

తటాలుమని ఒక కుర్రోడొచ్చి బరబరా లోపలి కీడ్చుకెళ్ళి పోయాడు.

''ప్రోగ్రాం బ్రహ్మాండంగా వుంటుంది సార్! చివరి దాకా వున్న వాళ్ళకి సూపర్ గిఫ్ట్ హేంపర్ కూడా వుంది'' అంటూ సీట్లో కుదేశాడు.

''సరే ... ఇప్పుడే ఇంటికి పోయి చేసే రాచ కార్యాలు మాత్రం ఏమున్నాయి. కనుక కాస్సేపు కూర్చుంటే పోలా. టిక్కెట్టా ... పాడా''

నేను సీటులో సెటిలయ్యానని నమ్మకం కలిగిన తరువాత గాని ఆ కుర్రాడు వెళ్ళి పోలేదు.

హాల్లో అంతా కలిపి ఒక పాతిక మందున్నారు.

మైక్ టెస్టింగ్‌తో కార్యక్రమం మొదలయింది.

నేపథ్యంలో ప్రకటన షబకు నమస్కారం. రస బరిత సమాఖ్య వారు సరసంగా షమర్పించు 'దిగ్రేట్ మిలీనియమ్ సూపర్ అవార్డు ఫంక్షన్ కొద్ది నిముషాలలో ప్రారంబం కాబోతుంది. ముందుగా కొన్ని షాంష్కృతిక ప్రదర్శనలు.'

తెర సగం దాకా తొలిగి గింజుకుంది. మిగిలిన సగాన్ని ఎవరో వచ్చి బరబరా లాగేశారు.

ప్రార్థన.

''అగజాననం ... పద్మార్కం ...'' ఎర్రటి ఎండలో మంచినీళ్ళ కోసం పరుగెత్తుతున్నట్లు రొప్పు.

కైలాసంలో వున్న వినాయకుడు వులిక్కిపడి పరుగెత్తుకొచ్చేటంత బిగ్గరగా పాడుతున్నాడా అభినవ జగ్గయ్య.

నా పక్కన కూర్చున్న పెద్ద మనిషి గభాలున లేచి నిలబడి తలొంచుకుని తన్మయత్వంతో తెగ వూగిపోతున్నాడు.

దేశ భక్తి గీతానికి గౌరవం నటించటం చూశాను గానీ, ఇట్లాంటి ప్రార్థనా గీతాలకు కూడా ఇంతలా యాక్షన్ చేయటం ఎక్కడా చూడలేదు.

అదే అడిగితే ధర్మవరపు సుబ్రహ్మణ్యంలాగా పడీ పడీ నవ్వాడాయన ''భక్తా ... పాడా ... ఆ పాడుతుంది ఎవరనుకున్నారూ! మా బాస్ ... లేచి నిలబడకపోతే రేపాఫీసులో క్లాసు పీకుతాడు'' అని జుట్టు పీక్కున్నాడు.

''మీ బాస్ గొంతు అంత ఇదిగా లేదే.''

''భలే వారే... ఆయనకింకొద్ది సేపట్లో ఈ సహ స్రాబ్దపు ఉత్తమ గాయకుడు అవార్డు అందబోతుంది.''

ఉలిక్కి పడ్డాను.

''ఈ 'రభస' వారికి ... ఐ మీన్ రసభరిత సమాఖ్య వారికింత కన్నా మంచి వాళ్ళు దొరకలేదా?!''

''అప్పటికే అన్ని అవార్డులకూ అందరూ బుక్కయి పోయారు సార్. మిగిలిందీ ప్రేయర్ సాంగ్ అవార్డే ... అన్నింటికన్నా ఇదే చీప్''

''చీపా? ... చీపేంటి?''


''ఆమాత్రం కూడా తెలీదా'' అన్నట్లు కొరకొరా చూశాడాయన. ''ఈ రోజు పేపర్లో చూడలేదాసార్... సన్మానాల పేరుతో చందాలెట్లా బలవంతంగా పోగేస్తున్నారో ...''

ఇంతలో మిమిక్రీ కార్యక్రమం మొదలయింది. ''ప్రపంచ ప్రఖ్యాత మిమిక్రీ ఆర్టిస్ట్ మారీచరావు మిలీనియమ్ షో.''

గొట్టంలాగున్న మనిషి మైకు ముందుకొచ్చి నిలబడ్డాడు. శరీరంలోని ఏ భాగం నుంచి సౌండొస్తుందో కనుక్కోవటం కష్టం ''బట్టలు పరపరా చించేస్తున్నట్లు, బల్లలు నేలమీద పడేసి బరబరా ఈడ్చేస్తున్నట్లు, తలుపులూ, కిటికీలు.. ధన ధనా ... గాలికి కొట్టుకుంటున్నట్లు ... భలేగా అనుకరిస్తున్నాడే కుర్రాడు!''

''అతనింకా ప్రోగ్రాం మొదలు పెట్టనే లేదుగదా మహానుభావా! మైక్ అడ్జస్ట్ చేసుకుంటున్నాడంతే'' కాస్సేపయిన తరువాత మళ్ళీ ''గుర్రం చప్పుళ్ళు భలే అనుకరిస్తున్నాడండోయ్'' అన్నానుత్సాహం పట్టలేక.

''అవి గుర్రం చప్పుళ్ళు కాదుసార్... ఘంటసాల పాట''




''ఘంటసాల పాట ఇందాకే అయిపోయింది కదండీ.''

''అది ఘంటసాల పాట కాదు బాబోయ్ ... జురాసిక్‌పార్క్ బల్లి గొంతు'' అని తల్లడిల్లి పోయాడాయన. మళ్ళీ మాట్లాడితే మర్యాదగా వుండదని మెదలకుండా వుండిపోయాను.

''మీరీ వూరికి క్రొత్తా!'' అనడిగాడతను ఒకైదు నిమిషాల తరువాత.

''అవును''

''అట్లా చెప్పండి'' అని జాలిగా చూశాడాయన.

కరతాళ ధ్వనులు మోగుతున్నాయదేపనిగా.

కంగారు పడ్డాను. హాల్లో అంతా కలిపి పాతికమంది కూడా లేరు. అన్ని వేల చప్పట్లా!

''అది ముందే రికార్డు చేసి పెట్టారు లేండి మధ్య మధ్య ఇట్లా మోగించటానికి.''

''టీ.వీ సీరియల్స్ మధ్యలో కుళ్ళు జోకులకు పడీపడీ నవ్వుతాయే గొంతులు అట్లాగన్న మాట.''

ఏర్పాట్లు భారీగానే ఉన్నాయి!

మైకు ముందు కింకోమనిషొచ్చి చిటికెలు కొట్టి సకిలించటం మొదలు పెట్టాడు.

''మళ్ళీ మిమిక్రీనా'' అన్నాను నీరసంగా.

''కాదు ... అతను రభస కార్యదర్శి.''

ప్రకటన మొదలయింది ''రభస వారు అతి సరసంగా ఇస్తున్న మిలీనియమ్ పురస్కారాలను తిరస్కరించకుండా స్వీకరించటానికి విచ్చేసిన వారికి హృదయ పూర్వక నమస్కారాలు.''

కరతాళ ధ్వనులు ... కేసెట్‌లో నుంచి.

''ముఖ్య అతిథులు ... వదాన్యులు ... వంకాయల వెంకయ్య గారు రావటానికింకా కొద్దిగా వ్యవధి వుంది ... ఈ లోగా దిగ్రేట్ మిలీనియమ్ షో 'శ్రీకృష్ణ రాయబారము''.

''వంకాయల వెంకయ్యెవరూ?''

''సెంటర్లో చిత్తు కాగితాల టోకు వ్యాపారం చేస్తాడ్లే. వదాన్యుడు అంటున్నారంటే వాడికి ఏ పదివేలో వడ్డించి వుంటారు...''

అతనింకా ఏదో అనబోయేంతలో హార్మోనియమ్ 'కయ్యి' మంది. కళాకారులందరూ గొంతు చించుకుని పాట అందుకున్నారు. ''పారాబ్రహ్మ ... పారామేశ్వరా ...'' గుడిసెలకు నిప్పంటుకున్నంత కంగారుగా వుంది వాతావరణం.

టెంకాయలు కొట్టిన చప్పుడు, హారతిచ్చి తెర తీశారు.

శ్రీకృష్ణ పరమాత్ముడు చెక్క బెంచీమీద శుభ్రంగా నిద్రబోతున్నాడు. తల దగ్గిర ప్లాస్టిక్ ఛైర్‌లో దుర్యోధనుడు, కాళ్ళ దగ్గిర చెక్క కుర్చీలో అర్జునుడు. తెరలో నుండి ప్రాంప్టింగ్ వాడిగోల ''కృష్ణా! పద్యం .. పద్యం చదువు''

కృష్ణుడు మంచి నిద్రలో వున్నట్లుంది ... బదులుగా గుఱక పెడుతున్నాడు. దుర్యోధనుడు తట్టి లేపుతున్నాడు ... ''కృష్ణా .. పద్యం చదవరా!''

అర్జునుడు అటువైపు నుండి కాళ్ళు పట్టుకు బ్రతిమాలుతున్నాడు. ప్రామ్‌టింగ్ వాడికి వళ్ళు మండినట్లుంది స్టేజీ మీదకొచ్చి కృష్ణుడు గొంతు పట్టేసుకున్నాడు. ''పద్యం చదవరా కొడకా అంటే... పందిలాగా గురక పెడతావా! చంపేస్తానోరే ...'' గబగబా తెర పడిపోయింది.

''ఫుల్ మందులో వున్నట్లుంది మహాత్ముడు.''

''ఆడంతే ... సంతోషం ఎక్కువైతే మందెక్కువవుతుంది.''

''అంత సంతోషమెందుకో?''

''ఆడికేగా ఈ సహస్రాబ్దపు ఉత్తమ నటుడు అవార్డు ఇస్తున్నారు. సంతోషం కాక మరేంటి'' అన్నాడా పక్కనున్న పెద్ద మనిషి.

ఈసారి తెర తీసేసరికి సీనే మారిపోయి వుంది. చెక్క బెంచీ మీద ధృతరాష్ట్రుడు. అతని వళ్ళో నాటకం పుస్తకం. ''అతనే ఈ నాటకానికి ప్రామ్‌టింగిచ్చేది'' కృష్ణుడి మొహాన నీళ్ళు కొట్టి స్టేజీ మీదకు నెట్టినట్టున్నారు. కళ్ళు నలుముకుంటూ వచ్చి భీష్ముడి పక్కన చేరి పద్యం అందుకున్నాడు. ''బావా! ఎప్పుడు వచ్చితి వీవు ...

''ఇప్పుడే ... నారాయణాద్రికి ... నాలుగ్గంటలు లేటు'' అని నాలుక్కరుచుకున్నాడు భీష్మాచార్యులు.

''అదేంటీ? కృష్ణుడట్లా వావివరసలు లేకుండా, సమయ సందర్భాలు చూడకుండా పద్యం పాడుతున్నాడూ?''

''వీడికొచ్చిన పద్యం ఇదొక్కటే...వెయ్యి రూపాయలు చందా ఇచ్చారని ఈ వేషం ఇచ్చారు.''

హఠాత్తుగా కరెంటు పోయింది. కారుచీకటి.

స్టేజీ మీద కెవరో పెట్రోమాక్స్ లైట్ తెచ్చి పెట్టారు. కిరోసిన్ కల్తీది కాబోలు. లైటు గుప్పు గుప్పుమంటోంది.

గుడ్డి ధృతరాష్ట్రుడు ఒక్క వూపులో పెట్రోమేక్స్ లైటు మీదికి దూకి పంపుకొట్టటం మొదలు పెట్టాడు.

''ధృతరాష్ట్రుడికి సొంతంగా సైకిల్ వుందిలే'' అన్నాడు పక్కనున్న పెద్ద మనిషి.

కరెంటొచ్చింది. కాస్సేపటికి వంకాయల వెంకయ్య గారూ విచ్చేశారు. వీడియో వాడికి నమస్కారాలు పెట్టుకుంటూ వేదిక ముందు కూర్చున్నారు.

నాటకం ఆగిపోయింది. పురస్కారాల కార్యక్రమం ప్రారంభమైంది.

స్టేజీ మీద దాదాపు పాతిక ఆసనాలున్నాయి. కుర్చీలు లేక కొన్ని స్టూళ్ళు ...ముక్కాలిపీటలు కూడా వేశారు.

''ఇంత మందికి పురస్కారాలా?!''

''ఈ సహస్రాబ్ది చివరికి వూళ్ళో మిగిలింది వీళ్ళే ...'' అన్నాడా పెద్ద మనిషి.

పేరు పేరునా పిలిచి సత్కరించాలంటే అధమ పక్షం ఆరు గంటలు పడుతుంది. అప్పుడే ఎనిమిదయింది. వెళ్ళి పోవాలనుకోని బైటకొచ్చాను.

గేటుకడ్డంగా కుర్రాడు నిలబడి వున్నాడు. ''అట్లా మధ్యలోపోతే ఎట్లాసార్?''

''అవతల నా కర్జంటు పనుందయ్యా!''

''ఐనాసరే సార్... ఆఖరిదాకా వుండాల్సిందే'' అంటూ గేటుకు తాళం వేసేశాడు.

గేటు దూకేద్దామన్నంత ఆవేశం వచ్చింది కానీ గేటు ఎత్తు చూసి చల్లబడి పోవాల్సి వచ్చింది. చేసేది లేక వెనక్కి వచ్చి సీట్లో కూలబడ్డాను.

అప్పటికే హాల్లోని జనమంతా వేదిక మీదకు చేరిపోయారు. మిగిలిందల్లా నేనూ, పక్కనున్న పెద్ద మనిషీ... ఇంకో ఇద్దరు ఆ మూల కూర్చుని వున్నారు.

దండలు సరిపడినన్ని లేక ఇద్దరిద్దరికి కలిపి ఒక దండ వేశారు. అలాంటి 'కోదండ' రాములు కొంత మంది కూర్చునేందుకు కుర్చీలు కరువై నేలమీదే చతికిలబడి ఉన్నారు.

ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో సహా నేల మీద కూర్చునుంటే, దుర్యోధనుడు అర్జునుడితో కలిసి ఐరన్ కుర్చీలో ఆసీనుడై ఉన్నాడు.

నాటకం పూర్తవలేదు కనక అందరూ వేషాలలోనే

ఉన్నారు పాపం.

వంకాయల వెంకయ్య గారు ఉపన్యాసం దంచేస్తున్నారు ''ఈ సరసాల అర్హుల వాళ్ళు ఇట్లాగే దండలు ఎత్తూ పోతోవుంటే ... అదేంటబ్బా ... ఈ సంవత్సరం సివరన వచ్చుద్ది .. అందరూ అంటా ఉన్నారు .. అదే ... మిల్లినీయమ్మ ... అదేందో? అప్పటికి ఊళ్ళో దండ పడని ఎదవే వుండడు .. శానా సంతోషం ..'' ఖాకీ డ్రస్సు వేసుకున్న వాడెవడో వచ్చి ఆయన చెవిలో ఏదో వూది అక్కడే నిలబడ్డాడు. పురస్కారాల పర్వం మొదలయింది.

రభస సెక్రటరీ పేర్లు చదువుతుంటే వంకాయలాయన దగ్గరకు వచ్చి వంగి పాదాభివందనం చేస్తున్నారు. ఆలిండియా బెస్ట్ పొయెట్ ఆఫ్ ది మిలీనియమ్ .. మిస్టర్ నస్యశ్రీ వంగివంగి నమస్కారాలు పెట్టుకుంటూ వచ్చాడు.

అదే దండలో వున్న మరో శాల్తీ ... ఆరుముగం ... అతనికి సెంటర్లో మిరపకాయ బజ్జీల బాండీ వుంది.

''ఆలిండియా బెస్ట్ కుక్ ఆఫ్ ద మిలీనియమ్'' ప్రకటించారతనికి.

''కవికీ ... కుక్కీ ఏమిటి సంబంధం?''

''వుప్పుకూ... ఉసిరికాయకూ ఉన్న సంబంధం ... దండ సంబంధం'' అన్నాడు పక్కనున్న పెద్ద మనిషి.

కవిగారు ఒక పెద్ద కాగితం మడత విప్పుతున్నారు. తట్టుకోవటం ఇంక నా వల్ల కాదు.

''తప్పదు. ఓర్చుకోండి ... ఇంకెంత .. గంటేగా ...''

''అమ్మో ... గంటే''

పురస్కారాల ప్రదానం నిరాటంకంగా సాగుతూనే వుంది. మధ్యమధ్యలో ఆ కాకీ మనిషి వంకాయ చెవులో ఏదో వూదటం వుండి వుండి కరతాళ ధ్వనులు ... పురస్కారం అందుకొన్న వాళ్ళు పాదాభివందనం చెయ్యాలి కాబోలు.

''ఆలిండియా బెస్ట్ స్వీపర్ ఆఫ్ ది మిలీనియమ్.''


చీపురుతో సహా స్టేజీ ముందుకొచ్చింది అప్పల నరసమ్మ.

వంకాయలకెక్కడి నుండో సెల్ ఫోనులో పిలుపొచ్చింది. ఆయన పూర్తిగా అటు తిరిగిపోయి మాట్లాడుతున్నాడు.

తర్వాత ముఖ్య అతిథి ధుర్యోధనుడే. మెమెంటో అందించే కార్యక్రమం తన మీద పెట్టుకున్నాడు.

''ఆలిండియా బెస్ట్ ప్రాంప్టింగ్ పర్సన్ ఆఫ్ ది మిలీనియమ్ ... సుబ్బరాజు''! ధృతరాష్ట్రుడి వేషంలో వున్న సుబ్బరాజు తన దండలో వున్న ధర్మరాజుతో సహా దుర్యోధనుడికి పాదాభివందనం చేస్తుంటే...

కరతాళ ధ్వనులు... ధృత రాష్ట్రుడూ, ధర్మరాజు కంబైన్డ్‌గా దుర్యోధనుడికి పాదాభి వందనం. ఇంత కంగాళీ కార్యక్రమం నేనింత వరకూ చూడలేదు. నిజంగానే ఇది 'ది గ్రేట్ మిలీనియమ్ షో'




అప్పటిదాకా పక్కనే వున్న పెద్ద మనిషి కూడా ఎక్కడికో వెళ్ళిపోయాడు.

''ఆలిండియా బెస్ట్ వలంటీర్ ఆఫ్ ది మిలీనియమ్ కనకరాజు...'' అని ఎనౌన్స్ చేయగానేగేటు దగ్గర కాపలా వున్న కుర్రాడు వేదిక మీదకు పరుగెత్తికెళ్ళిపోయాడు.

గేటు దగ్గరిప్పుడెవ్వరూ లేరు. పారిపోయేందుకిదే అదను. కంగారుగా లేవబోతున్న నన్ను అటు పక్కనున్న మనిషి ఆపేశాడు. లాభం లేదు సార్... గేటు కాడ కుక్కను కట్టేశారు.''

నీరసంతో అట్లాగే కూలబడిపోయాను. మళ్ళీ ఆ మనిషే అడిగాడు ''మేమంటే సదువ్వూ, సందేలేని ఎదవలం. సదువుకున్న బాబులు మీరెట్టా పడ్డారయ్యా ఈళ్ళ బుట్టలో...?'' మాట్లాడే స్థితిలో లేను. అతనే చెప్పుకు పోతున్నాడు. ''ఆత్మకూరు నుండి ఇజైవాడ పోతన్నాం దొరా! ఈ వూరికొడికొచ్చే సరికి బస్సు రిపేర్లో పడింది. పాసింజర్సందరం దిగిపోయినాం. బస్సు బాగవటానికింకా రెండు గంటలు టైముందంటే... ఒటేల్లో బోయినంసేసి ఇటొచ్చినాము. ఈ లైట్లు, యవ్వారం సూసి మా బావమర్ది గాడు సినిమా ఆలనుకొని లోపలికి తోలుకొచ్చిసినాడు బాబూ'' అని బావురుమన్నాడు.

మిగిలిన కథ అర్థమవుతూనే వుంది. ''ఈపాటికి బస్సు కూడా ఎల్లిపోయుండాల ... మా లగేజంతా అందులోనే వుంది బాబయ్యా'' వెక్కివెక్కి ఏడుస్తున్న అతనిని ఓదార్చటం నా వల్లేమవుతుంది!

పెద్ద మనిషి పొట్ట చేత్తో పట్టుకుని నవ్వుతూ పరుగెత్తుకొచ్చాడు. ''పళ్ళేలన్నీ అయిపోయినాయట. పురస్కారాలు అందవల్సిన వాళ్ళింకా అరడజను మంది దాకా వున్నారు.''

''పళ్ళేలంటే?''

''అదేనండి... వాళ్ళిచ్చే మెమెంటోలు .. అచ్చం సత్తుపళ్ళేల్లాగే ఉన్నాయ్‌గా .... అవీ అయిపోయాయోచ్ ...''

''అంటే ఈ కార్యక్రమం ఇంతటితో సమాప్తం'' అన్నాను ఆనందం పట్టలేక.

''అబ్బ ... ఆశ... కేంటిన్లో ఎంగిలి పళ్ళేలను కడిగిస్తున్నారు. అవే మిగిలిన వాళ్ళకి మెమెంటోలు.''

''ఇంత దరిద్రపు ఆలోచన ఎవరికొచ్చింది బాబూ!''

''అట్లా తిట్టకండి సార్ ... వాళ్ళకా అయిడియా ఇచ్చింది నేనే ... నాకూ ఒక మెమెంటో ఇస్తారని ఆశ పెడితేనూ ...''

మైకులో ఎనౌన్స్‌మెంట్ వినబడింది ''ఆలిండియా బెస్ట్ ఇంటలిజెంట్ ఆఫ్ ది మిలీనియమ్ ... పిచ్చిరాజు''

కరతాళ ధ్వనులు ... నా పక్కనున్నాయన నవ్వుతూ నాకు దండం పెట్టి పోబోతున్నాడు. నాకు పిచ్చి కోపమొచ్చింది. అమాంతం ఆయన కాలరు పట్టుకున్నాను ''నిజంగానే నువ్వంత ఇంటలిజెంట్ వయితే ... ఈ ప్రశ్నకు సమాధానం చెప్పు ...''

''అడుక్కోండి సార్.''

''ఆ వంకాయల వాడు వచ్చినప్పటి నుండీ చూస్తున్నా ... వాడి వెనకున్న ఆ ఖాకీమార్కు మనిషెవడు? వాడస్తమానం వంకాయ చెవిలో ఏందో ఊదుతున్నాడు?''

పక్కనున్న పెద్ద మనిషి పకాలున నవ్వాడు ''ఓస్... ఇదా మీ డౌట్... ఇంకేందో అనుకున్నా... ఆ ఖాకీమార్కు వాడు ఆటో డ్రైవర్ ... వంకాయల వెంకయ్య వాడి ఆటోలోనే ఇక్కడికొచ్చింది. మీటరు మీద రెండు రూపాయలివ్వమని వాడి పేచీ ... మీటింగయిందాకా వుండు ... మెమెంటో ఇప్పిస్తా నంటున్నాడు వంకాయలాయన...''

కరతాళ ధ్వనులు ... ''ఆలిండియా బెస్ట్ డోనర్ ఆఫ్ ది మిలీనియమ్'' ... వంకాయల వెంకయ్య గారు కేంటిన్లోని ఎంగిలి పళ్ళెన్ని మెమెంటో క్రింద అందుకుంటున్నారు. ★